క్లుప్తంగా

సమాజంలో అందరూ సమానమే

ఉయ్యూరు: సమాజంలో అందరూ సమానమేనని.. లింగ ఆధారిత వివక్ష కూడదని ఎంపీడీఓ జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. లింగ ఆధారిత వివక్షతకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారంలో భాగంగా శనివారం ఉయ్యూరు ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శేషగిరిరావు మాట్లాడుతూ లింగ వివక్షతో వ్యవహరించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం అమరేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

నిడమానూరు పంచాయతీకి విద్యుత్ శాఖ నోటీసులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు పంచాయతీకి విద్యుత్ బిల్లుల బకాయిల నిమిత్తం శనివారం ఆ శాఖ నోటీసులు అందించింది. వీధి దీపాల నిర్వహణ, వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్లు, మోటారు బోర్ల ద్వారా తాగునీటి సరఫరా నిమిత్తం నిడమానూరు పంచాయతీ మండలంలోనే అత్యధికంగా సుమారు రూ. 5 కోట్లు విద్యుత్ శాఖకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. దీంతో పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ విద్యుత్ బిల్లుతో పాటు నోటీసులను విద్యుత్ శాఖ అధికారులు జారీ చేశారు. ఇదే కోవలో రామవరప్పాడు పంచాయతీ రూ. 56 లక్షలు, గూడవల్లి రూ. 98 లక్షలు, ప్రసాదంపాడు రూ. 1.90 కోట్లు, ఎనికేపాడు. 2.6 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



ఉయ్యూరు: మానవ హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉయ్యూరు పట్టణ ఎస్ఐ విశ్వనాథ్ అన్నారు. పట్టణంలో కృష్ణాజిల్లా హ్యూమన్ రైట్స్ జస్టిస్ మూమెంట్ ఆఫీసును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎస్ఐ విశ్వనాథ్ మాట్లాడుతూ మానవ హక్కుల కార్యాలయాన్ని యువత ఉయ్యూరులో ప్రారంభించడం అభినందనీయమన్నారు. ప్రజలు కార్యాలయం ద్వారా మెరుగైన సేవలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు ముబారక్, ఇస్మాయిల్, దీపిక, చిన్నా, సద్దాం ఖాన్, సాజీదా, ఆసిఫ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు



ఉయ్యూరు: రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఏపీడీఈఈఏ అధ్యక్షుడు పినమాల నాగకుమార్ అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, ఏపీడీఈఈఏ ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో శనివారం రాజ్యాంగ ఆవశ్యకత అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కొలసాని రవికుమార్, ఉపాధ్యాయులు జీవీ రమణ, ఆంజనేయులు, లాల్, ఊర్మిళ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీతిరుపతమ్మ సేవాసదనం నిర్మాణానికి విరాళం



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న సేవాసదనం నిర్మాణానికి నర్రా లక్ష్మీచందన రూ. 50,116 విరాళం ఇచ్చారు. ఈ మేరకు శనివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు ఆమె తల్లిదండ్రులు నర్రా సుబ్బారావు, వెంకటపద్మావతి విరాళం నగదును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ గ్రామస్తులందరి సహకారంతో రానున్న అమ్మవారి వార్షిక కల్యాణంలోపు సేవాసదనం పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఆలయ కమిటీకి చెందిన జాస్తి శ్రీనివాసరావు, పొట్ల శివలీల తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సమన్వయంతో పనిచేసి రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. దుర్గాపురం పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు, ఆయుష్మాన్ భారత్ గుర్తింపు సంఖ్యల నమోదు, ల్యాబ్ పరీక్షలు తదితర సేవలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరూ సంతృప్తితో వెళ్లేలా సిబ్బంది సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యం.. ఆహ్లాదం



అల్లుకుపోయిన వాము తీగ



ఘాటైన తెలంగాణ మిర్చి మొక్కలు



కళకళలాడుతున్న గోంగూర, తోటకూర



ఏపుగా పెరిగిన వంగ మొక్కలు

- కోలవెన్ను జెడ్పీ పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు
- రకరకాల కూరగాయల మొక్కల పెంపకం
- కిచెన్‌గార్డెన్ నుంచే పాఠశాలకు అవసరమైన కూరగాయలు
- విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న పీడీ సుశీల

కంకిపాడు: ఆహ్లాదం.. ఆరోగ్యం.. రెండూ ఉంటేనే చదువుపై ఏకాగ్రత పెరుగుతుంది. ఈ విషయాన్ని గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయిని క్రీడల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు పాఠశాల ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న కొంత స్థలాన్ని కిచెన్ గార్డెన్‌గా మార్చేశారు. అందులో రకరకాలైన కూరగాయల మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి అవసరమైన కొన్ని కూరగాయలు ఈ కిచెన్ గార్డెన్ నుంచే అందిస్తున్నారు. ప్రత్యేకంగా విద్యార్థుల బృందం ఏర్పాటుచేసి గార్డెన్‌లో మొక్కల సంరక్షణ చేపడుతూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కోలవెన్ను జెడ్పీ పాఠశాలలో ఏర్పాటుచేసిన కిచెన్ గార్డెన్‌పై ప్రత్యేక కథనం.

రెండు సెంట్ల స్థలంలో గార్డెన్ ఏర్పాటు

కోలవెన్ను జిల్లా పరిషత్ పాఠశాలలో 236 మంది వరకూ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గ్రామానికి చెందిన దాత కంచర్ల చిన్ని రూ. 15 వేలు, రిటైర్డు హెచ్‌ఎం అట్లూరి ప్రభాకర్ రూ. 5 వేలు, మరో ఉపాధ్యాయిని రూ. వెయ్యి వితరణగా అందించారు. ఈ మొత్తానికి తోడు కిచెన్ గార్డెన్‌కు పాఠశాల ఎంపిక కావడంతో రూ. 5 వేలు నిధులు వచ్చాయి. పాఠశాలకు పడమర వైపున నిరుపయోగంగా ఉన్న రెండు సెంట్ల స్థలంలో వృక్షాలను తొలగించారు. విజయవాడ, తెలంగాణ ప్రాంతమైన ఖమ్మం పరిసరాల నుంచి తెప్పించిన నాణ్యమైన కూరగాయల విత్తనాలను ఈ స్థలంలో నాటారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని చంద్రాల సుశీల గార్డెన్ నిర్వహణను భుజానకెత్తుకున్నారు.



కిచెన్ గార్డెన్‌లో పండించిన కూరగాయలు

సేంద్రీయ విధానంలో కూరగాయలు

గార్డెన్‌లో వంగ, బెండ, టమాట, మిర్చి, గోంగూర, తోటకూర, బచ్చలికూర (తీగ బచ్చలి/సిలోన్ బచ్చలి), అరటి, సొర, కాకర, బీర, ఆరోగ్య ప్రదాయినిగా పిలిచే నల్లేరు, వాము తీగ, బంతి పూల మొక్కలను సైతం నాటి సంరక్షిస్తున్నారు. ఇప్పటికే రెండు విడతలు కోతలు జరిగి మూడో దశ కోతకు మొక్కలు రెడీ అవుతున్నాయి. వీటితో పాటుగా నూతనంగా తీగ జాతి మొక్కల విత్తనాలను నాటి సంరక్షిస్తున్నారు. ఇందుకు గానూ ఆరుగురు విద్యార్థులు అడవి శర్మ, రాధాకృష్ణ, హర్షిత్, భరణి, లోకేష్, అరుణ్‌కుమార్‌లతో ప్రత్యేక కిచెన్‌గార్డెన్ టీం ఏర్పాటుచేశారు. ఉదయం అర్ధగంట, సాయంత్రం అర్ధగంట విద్యార్థులతో పాటుగా వ్యాయామ ఉపాధ్యాయిని మొక్కల సంరక్షణ, కలుపు తీత పనులను నిర్వహిస్తూ ఎరువులు, పురుగు మందులు వాడకుండా సేంద్రీయ విధానంలో కూరగాయలను పండిస్తున్నారు.

పాఠశాల అవసరాలకు సమకూరుస్తూ..

ఈ గార్డెన్‌లో పండే కూరగాయలను మధ్యాహ్న భోజన పథకంలో వినియోగిస్తున్నారు. భోజన పథకానికి అవసరమైన దానిలో కొన్ని కూరగాయలు ఈ గార్డెన్ నుంచే సమకూరుతున్నాయంటే అతిశయోక్తి కాదు. అంతేకాకుండా టీం సభ్యుల కుటుంబాలకు సైతం ఈ గార్డెన్ నుంచే కూరగాయలను అడపాదడపా అందిస్తున్నారు. విత్తనాల కొనుగోళ్లు, గార్డెన్ నిర్వహణకు ఇప్పటి వరకూ పీడీ సుశీల దాతల సాయంతో కలిపి రూ. 62 వేలకు పైగా వెచ్చించి చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో తన వంతు పాత్ర పోషిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

పిల్లల ఆరోగ్యమే లక్ష్యం



చిన్నప్పటి నుంచి నాకు వ్యవసాయం అంటే ఇష్టం. మొక్కలు పెంచడం, వాటి సంరక్షణ నిత్యం చేస్తుంటా. పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని గార్డెన్‌గా మార్చాను. మంచి విత్తనాలు సేకరించి కూరగాయల మొక్కలు నాటాం. మూడో కోతకు మొక్కలు రెడీ అవుతున్నాయి. నేటి తరం వారు మట్టి విలువ కూడా తెలియకుండా పెరుగుతున్నారు. ఎరువులు వాడకుండా పండించిన కూరగాయలు తింటే ఆరోగ్యంగా ఉంటారు. పిల్లలకు మంచి ఆహారం అందాలన్నదే నా ఉద్దేశ్యం.

చంద్రాల సుశీల,
పీడీ, కోలవెన్ను జెడ్పీ పాఠశాల

ఘనంగా సత్యసాయిబాబా జయంతి



కంకిపాడు: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 99వ జయంతిని ప్రొద్దుటూరు గాయత్రీ విహార్‌లో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యాన శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు అల్పాహారం పంపిణీ చేశారు. స్వామివారి పాదుకలకు అష్టోత్తర పూజలు, నామ సంకీర్తన నిర్వహించారు. కేక్ కట్ చేసి భక్తులకు పంచారు. కార్యక్రమంలో జి.మురళీమోహన్, కె.రాంబాబు, రావి రమేష్, కొల్లా జనార్ధన్, మాధవరావు, గ్రంధి హేమంత్, విశ్వనాథ్, పుష్పవతి, శ్రీలక్ష్మి, రేవతి, రాధ పాల్గొన్నారు.

బాలలకు పుస్తక పఠనం పోటీలు



గన్నవరం రూరల్: పుస్తక పఠనం మన జీవనంలో భాగం కావాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం ఆకాంక్షించారు. శనివారం గ్రంథాలయంలో బాలలకు పుస్తక పఠనం పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం జూనియర్స్ విభాగంలో ఉత్తమంగా రాణించిన దొండపాటి సాత్విక్‌కు మెమెంటో అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిన్న నాటి నుంచి విద్యార్థులను గ్రంథాలయాలకు పంపాలని సూచించారు. గుమ్మడి వెంకట్రామయ్య, నాగభూషణం, ప్రసాదరావు, పాఠకులు పాల్గొన్నారు.

అర్హులైనవారు ఓటు నమోదు చేసుకోవాలి

ప్రత్యేకాధికారి కేఎస్ఎన్ మూర్తి

పెనమలూరు: అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఏపీ ఎన్నికల అధికారి కార్యాలయం ప్రత్యేకాధికారి కేఎస్ఎన్ మూర్తి సూచించారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన కానూరులో సిద్ధార్థ లా కాలేజీలోని 26, 27, 31వ నెంబర్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1.1.2025 తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. నవంబర్ 28వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. ప్రత్యేక తేదీల్లో బూత్ స్థాయి అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని చెప్పారు. అర్హులైన వారు ఓటు నమోదు, సవరణ, తొలగింపునకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీటీ రాజు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఉయ్యూరు: ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. ఉయ్యూరు మండలంలోని అన్ని గ్రామాల్లో, పట్టణంలోని 20 వార్డుల్లో ఆయా పోలింగ్ బూత్‌ల్లో శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆకునూరు, గండిగుంట గ్రామాల్లో ఓటరు నమోదు కేంద్రాలను తహసీల్దార్ సురేష్‌కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ యతీంద్ర పాల్గొన్నారు.



కానూరులో ఓట్ల నమోదును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి మూర్తి

కంకిపాడులో..

కంకిపాడు: ఓటు హక్కును నమోదుచేయించుకోవాలని తహసీల్దార్ వి.భావనారాయణ సూచించారు. మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పరిశీలనలో డీటీ శ్రీనివాసరావు, ఆయా గ్రామాల వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

యనమలకుదురులో పల్లెప్రగతి



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ యనమలకుదురులో శనివారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పల్లెప్రగతి నిర్వహించారు. గ్రామంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు గుర్తించి న్యాయం చేస్తామన్నారు. ప్రజలు తన వద్దకు రాకుండా తానే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటానన్నారు. కాగా పింఛన్‌లు, రేషన్ కార్డులు, రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీల నిర్మాణంపై గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, అనంతనేని ఆజాద్, స్థానికులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్ల కత్తిరింపుపై ఫిర్యాదు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): గత పదిహేను రోజులుగా పెనమలూరు ప్రాంతంలో లోకల్‌గా ఉండే కొంతమంది వ్యక్తులు తమ నెట్‌వర్క్‌కు చెందిన వైర్లను కత్తిరించి కేబుల్ ప్రసారాలు కాకుండా ఇబ్బందులు కలిగిస్తున్నారని సిటీ కేబుల్ ఎండీ పొట్లూరి సాయిబాబు తెలిపారు. స్థానిక సిటీ కేబుల్ ఆఫీస్‌లో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 15 రోజులుగా పెనమలూరు నియోజకవర్గ పరిధిలో కొంత మంది వ్యక్తులు కుట్రపూరితంగా రూ. లక్షలు విలువ చేసే కేబుల్ వైర్లను కత్తిరించి ప్రసారాలకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని పెనమలూరు సీఐ, జిల్లా ఎస్పీకి ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వీఆర్ సిద్ధార్థలో అంతర్జాతీయ సదస్సు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం కాలేజీలో పోస్టర్ ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. కాలేజీలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో ఇంటిలిజెంట్ కంప్యూటింగ్ అండ్ కమ్యూనికేషన్-2025 (ఐసీఐసీసీ) 8వ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చే ఏడాది జూన్ 25, 26వ తేదీల్లో సదస్సు జరుగుతుందని చెప్పారు. ప్రొ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, ఐటీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం. సునీత, సీఎస్‌ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ డి. రాజేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే ఏడాది జూన్ 2వ తేదీ నాటికి దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. ఈ ప్రతిష్టాత్మక సదస్సులో మూల రచనలు సమర్పించడానికి ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. వివిధ దేశాల ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.రవిచంద్, డైరెక్టర్ పాండురంగారావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైస్‌చాన్స్‌లర్ తదితరులు

ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- పెనమలూరులో మొత్తం ఓట్లు 13,684
- వచ్చే నెల 9 వరకు అభ్యంతరాల స్వీకరణ

పెనమలూరు: కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితాను శనివారం ప్రకటించారు. ఈ మేరకు సహాయ ఎన్నికల అధికారి, పెనమలూరు తహసీల్దార్ గోపాలకృష్ణ వివరాలు వెల్లడించారు. కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదుకు గత సెప్టెంబర్ 29 నుంచి నవంబర్ 6వ తేదీ వరకు ఫారం-18 దరఖాస్తులు స్వీకరించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఓట్ల నమోదుకు పెనమలూరు నియోజకవర్గంలో మొత్తం 13,684 దరఖాస్తులు అందాయన్నారు. అందిన దరఖాస్తులపై విచారణ చేసి ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించామని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న ఓటర్లు తమ వివరాలు పరిశీలించుకోవాలని సూచించారు. చేర్పులు, మార్పులు, తొలగింపులకు వచ్చే నెల తొమ్మిదవ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సహాయ ఎన్నికల ఓట్లు నమోదు అధికారుల కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు. ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
పెనమలూరు	5,189	4,104	1	9,294
కంకిపాడు	1,002	852	1	1,855
ఉయ్యూరు	1,371	1,163	1	2,535
మొత్తం ఓట్లు	7,562	6,119	3	13,684

ఉంగుటూరులో 1,123 మంది

ఉంగుటూరు: మండలంలో 1,123 మంది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ జె.విమలకుమారి తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 27 గ్రామ పంచాయితీల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించగా 1,123మంది ఓటు హక్కుకు అర్హత పొందారని చెప్పారు. మండలంలో అన్ని గ్రామాలకు కలిపి ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంగా ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్ నార్త్ బిల్డింగ్‌లో మొదటి రెండు గదులు ఎంపిక చేశారని తహసీల్దార్ పేర్కొన్నారు.

26న ర్యాలీలను జయప్రదం చేయండి

గన్నవరం: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న రైతు ర్యాలీలను ప్రజా సంఘాలు జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిశెట్టి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గొరిశెట్టి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంబాని వంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెట్టడమే పనిగా పెట్టుకుందన్నారు. వ్యవసాయ రంగంలో కార్పొరేట్ విధానాన్ని ప్రవేశ పెట్టడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీలను విజయవంతం చేయాలని కోరారు. ప్రజా సంఘాల నేతలు టీవీ లక్ష్మణస్వామి, సూరగాని సాంబశివరావు, కళ్లం వెంకటేశ్వరరావు, రామరాజు, మల్లంపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గొరిశెట్టి

ఆధార్ అప్‌డేట్‌కు అష్టకష్టాలు

- నమోదు, మార్పులకు రోజుల తరబడి పడిగాపులు
- తెల్లవారుజాము 5 నుంచే క్యూలైన్లు
- బాపులపాడు మండలంలో ఒకే ఒక్క ఆధార్ నమోదు కేంద్రం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆధార్ కార్డు మార్పులంటేనే జనం భయపడుతున్నారు. ఆధార్ నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. ఆధార్ కార్డు నంబర్ అన్ని రకాల ప్రభుత్వ గుర్తింపు కార్డులకు లింక్ చేయాలనే నిబంధనలు సామాన్యులకు చిక్కులు తెచ్చిపెడుతున్నాయి. దీనికి తోడు విద్యార్థులకు 'అపార్' ఐడీ నమోదుకు కూడా ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవాల్సి రావడంతో వీరంతా ఆధార్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. దీంతో ఆధార్ కేంద్రాల వద్ద తీవ్ర రద్దీ ఏర్పడుతోంది.

లక్ష జనాభాకు ఒక్కటే కేంద్రం

హనుమాన్‌జంక్షన్ పరిసర గ్రామాలు, బాపులపాడు మండలంలోని గ్రామాలన్నింటికీ ఒక్కటే ఆధార్ కేంద్రం కావడంతో ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. గతంలో బాపులపాడు మండలంలో ఎస్‌బీఐ, బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం, హనుమాన్‌జంక్షన్, కానుమోలు సబ్ పోస్టాఫీసుతో పాటుగా పెరికీడు, శేరినరసన్నపాలెం, బొమ్ములూరు గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ ప్రస్తుతం హనుమాన్‌జంక్షన్ పోస్టాఫీసులో మాత్రమే ఆధార్ సేవలను అందిస్తుండగా, మిగిలిన ఆరు కేంద్రాలు వివిధ కారణాలతో మూతబడ్డాయి. దీంతో దాదాపు లక్షకు పైగా జనాభా కలిగిన బాపులపాడు మండలం, హనుమాన్‌జంక్షన్ ఏరియాకు పోస్టాఫీసు ఆధార్ కేంద్రం ఒక్కటే దిక్కు. దీంతో ఇక్కడ తీవ్ర రద్దీ ఏర్పడుతోంది. ఆధార్ నమోదు, మార్పుల నిమిత్తం హనుమాన్‌జంక్షన్ పోస్టాఫీసుకు రోజుకు కనీసం 200-300 మంది వరకూ వస్తుండగా, అక్కడి సిబ్బంది సగటున 20 నుంచి 25 మందికి మాత్రమే ఆధార్ సేవలను అందిస్తున్నారు. దీంతో మిగిలిన జనమంతా తీవ్ర నిరాశతో ఇళ్లకు తిరిగి వెళ్లిపోతున్నారు.



హనుమాన్‌జంక్షన్ పోస్టాఫీసు వద్ద ఆధార్ సేవల కోసం బారులుతీరిన ప్రజలు

అపార్ ఐడీ నమోదుకు విద్యార్థులు..

కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్, వన్ స్టూడెంట్ ఐడీ స్లోగన్‌తో 'ఆటోమెటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్టరీ (అపార్)' నమోదును ప్రతి పాఠశాలలో ప్రవేశపెట్టిన విషయం విదితమే. పాఠశాల రికార్డుల ప్రకారం అన్ని వివరాలు విద్యార్థి ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రాల్లో ఒకే విధంగా ఉంటేనే అపార్ నమోదు చేసేందుకు ఆస్కారం ఉంటుంది. కానీ అధిక శాతం విద్యార్థుల ఆధార్ కార్డుల్లో పేరు, పుట్టిన తేదీ వివరాలు పాఠశాల రికార్డులకు భిన్నంగా ఉన్నాయి. దీంతో వారంతా ఆధార్‌లో ఆ వివరాలు సరిచేసుకునేందుకు హనుమాన్‌జంక్షన్ పోస్టాఫీసుకు వస్తున్నారు. దీనికితోడు ఆధార్-పాన్ లింక్, ఆధార్-బ్యాంకు ఖాతా లింక్ కోసం కూడా మార్పులు చేసుకోవాల్సి రావడంతో ఆధార్ కేంద్రాల వైపు పరుగులు పెడుతున్నారు.

తెల్లవారుజాము ఐదు గంటలకే క్యూలైన్లు

బాపులపాడు మండలంలో ఒకే ఒక ఆధార్ కేంద్రం పని చేస్తుండటంతో హనుమాన్‌జంక్షన్ పోస్టాఫీసు వద్ద ప్రజల రద్దీ ఎక్కువైంది. ముందుగా వచ్చిన 20-25 మంది వరకే ఆధార్ సేవలు అందిస్తామని పోస్టల్ సిబ్బంది చెబుతుండటంతో తెల్లవారుజాము ఐదు గంటల నుంచే ప్రజలు బారులుతీరుతున్నారు. గంటల తరబడి పోస్టాఫీసు వద్ద క్యూలో నిలబడితే అదృష్టం ఉంటే టోకెన్ దక్కుతుంది, లేకపోతే ఆ రోజుకు టోకెన్లు అయిపోయాయని అధికారులు చెప్పడంతో ఉసూరుమంటూ ఇళ్లకు తిరిగి వెళ్తున్నారు. రోజుల తరబడి ఇదే తంతు పోస్టాఫీసు వద్ద దర్శనిస్తోంది. బాపులపాడు మండలంలో మరిన్ని శాశ్వత ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పెట్లు, దుప్పట్ల పంపిణీ

గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లి బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో శనివారం విద్యార్థులకు కార్పెట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహం వార్డెన్ పి. డానియల్ 45 మంది విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన కార్పెట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు.

ప్రకటన

[illegible]